
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 729 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

42.7°/23.8°

జిల్లావ్యాప్తంగా బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.



నామినేషన్ పత్రాలను ఆర్ఓ అరుణ్‌బాబుకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ



ఆర్ఓ భాగ్యరేఖకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పుట్టపర్తి అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఆర్ఓకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ధర్మవరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



నామినేషన్ పత్రాలను ఆర్ఓ వసంత బాబుకు అందజేస్తున్న రాప్తాడు అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



నామినేషన్ పత్రాలు ఆర్ఓ వద్ద దాఖలు చేస్తున్న హిందూపురం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్ దీపిక

విజయఢంకా మోగిస్తాం

ప్రజల ఆశీర్వాదంతో తప్పకుండా జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయఢంకా మోగిస్తాం. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే మా విజయానికి బాటలు కానున్నాయి. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల యుద్ధంలో కచ్చితంగా పేదలే విజయం సాధిస్తారు. మీరంతా ఇప్పటివరకూ నాపై చూపిన అభిమానికి కృతజ్ఞతలు. పేదల కోసం సీఎం జగనన్న 130 సార్లు బటన్ నొక్కారు. పోలింగ్ రోజున మీరు రెండు సార్లు ఫ్యాన్ బటన్‌పై నొక్కాలని విజ్ఞప్తి చేస్తున్నా.

– జోలదరాశి శాంతమ్మ, హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి

అభివృద్ధికి పట్టం కట్టండి

ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి మీ కళ్లముందే కనిపిస్తోంది. సంక్షేమ లబ్ధి మీ ఇంటి గడప వద్దే అందుతోంది. సత్యసాయి బాబా చల్లని దీవెనలతో పుట్టపర్తి జిల్లా కేంద్రమైంది. నియోజకవర్గంలో రూ.కోట్లతో జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. 193 చెరువులకు నీరిచ్చే కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. అందుకే జగనన్న 'మీకు మంచి జరిగి ఉంటేనే మాకు ఓటువేయండి' అని ధైర్యంగా అడుగుతున్నారు. అభివృద్ధికి మరోసారి పట్టం కట్టండి. జగనన్నను మరోసారి సీఎంగా చూసేందుకు వైఎస్సార్ సీపీకి ఓటు వేయండి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

ప్రత్యర్థులకు వణుకు పుట్టాలి

మా ప్రభుత్వంలో పేదలకు సాయం చేయగలిగాం. నియోజకవర్గంలో రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. అర్హులందరికీ పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించగలిగాం. అందుకే ధర్మవరంలో నన్ను ఎదుర్కొనేందుకు మూడు పార్టీలు కలిసి వచ్చాయి. ఇక్కడివారికి చేతకాక ఢిల్లీనుంచి కొత్తగా ఓ వ్యక్తిని తీసుకొచ్చారు. డబ్బు, మద్యం పారిస్తున్నారు.. బెదిరించి లబ్ధిపొందాలని చూస్తున్నారు. కానీ చిన్న పిల్లోడిని కూడా భయపెట్టలేరని వాళ్లు తెలుసుకుంటారు. ధర్మవరంలో వచ్చే మెజార్టీతో ప్రత్యర్థులకు వణుకుపుట్టాలి.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ధర్మవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

అభివృద్ధి నిరోధకులను తరిమికొట్టండి

అభివృద్ధి నిరోధకులను రాప్తాడు నుంచి తరిమికొట్టండి. అభివృద్ధికి పట్టం కట్టండి. రాప్తాడు నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. జగనన్న సహకారంతో పైసా ఖర్చు లేకుండా పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చా. నియోజకవర్గంలో 17 వేల మందికి ఇళ్లు మంజూరు చేయించా. రెండు వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించాం. మహిళా పాడి రైతుల కోసం అమ్మ డెయిరీ ఏర్పాటు చేశా. మరోసారి అవకాశం కల్పిస్తే రామగిరి బంగారు గనులు తెరిపిస్తా. సోలార్ ప్లాంట్లు, పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

మీ ఆడపడుచును.. ఆశీర్వదించండి

మండే ఎండను సైతం లెక్కచేయకుండా నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన మీకు ఎప్పుడూ రుణపడి ఉంటా. నాపై చూపుతున్న ప్రేమాభిమానం, ఆశీర్వాదాలను ఎప్పటికీ మరువను. ఎన్నికల వేళ వచ్చిపోయే సినిమా ఆర్టిస్టును కాదు. నిత్యం మీకోసం మీ మధ్యే ఉంటున్న మీ ఇంటి ఆడపడుచును. మీకు ఏ కష్టం కలగకుండా చూసుకుంటా. ఆశీర్వదించండి 'పురం' అభివృద్ధికి నాంది పలకండి. మీ అందరి మద్దతుతో తప్పకుండా హిందూపురం రూపురేఖలు మారుస్తాం. అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతా.

– టీఎన్ దీపిక, హిందూపురం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

జనసాగరం.. జగన్నినాదం

ధర్మవరం జనసాగరమైంది. 'పురం' అభిమాన సంద్రాన్ని తలపించింది. పుట్టపర్తిలో ఇసుకేస్తే రాలనంత జన ప్రవాహం కనిపించింది. రాప్తాడు అభిమానులతో పోటెత్తింది. నామినేషన్ల వేళ వైఎస్సార్ సీపీ జెండా సగర్వంగా రెపరెపలాడింది. అభిమానుల గుండెల్లోంచి వచ్చిన జై జగన్నినాదం మిన్నంటింది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వెంట రాగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్ పర్వం అట్టహాసంగా సాగింది.

- నామినేషన్ల కోలాహలం
- జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం
- వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురంలో జన సునామీ
- భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు





నామినేషన్ వేసేందుకు పుట్టపర్తిలో ర్యాలీగా వెళుతున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ నామినేషన్ ర్యాలీ సందర్భంగా అభిమాన సంద్రాన్ని తలపించిన పుట్టపర్తి



ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జనసందోహం

సాక్షి, పుట్టపర్తి

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్ల ఘట్టం విజయోత్సవాలను తలపించింది. వేలాదిగా కార్యకర్తలు తరలిరాగా రహదారులన్నీ జనసంద్రాలను తలపించాయి. హిందూపురం పార్లమెంటుతో పాటు హిందూపురం, ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం నుంచి ఆయా నియోజకవర్గాల పరిధిలో పండుగ వాతావరణం కనిపించింది. అన్ని మండల కేంద్రాల నుంచి ఉదయమే భారీ ర్యాలీలతో కార్యకర్తలు తరలివచ్చారు. నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో సందడి నెలకొంది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అభ్యర్థులను భారీ గజమాలలతో సత్కరించారు. పార్లమెంటు వ్యాప్తంగా ఒకే రోజున లక్ష మంది పైగా నామినేషన్ల మహోత్సవంలో పాల్గొన్నట్లు అంచనా. పోలింగ్ కంటే ముందే ప్రతిపక్ష కూటమిలో భయం నింపేలా నామినేషన్ పర్వం సాగింది.

ధర్మవరంలో జనసునామీ..

ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నామినేషన్ పర్వం అట్టహాసంగా సాగింది. శివానగర్‌లోని బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథ ఆలయంలో పూజలు చేసిన కేతిరెడ్డి .. అక్కడి నుంచి దిమ్మెల సెంటర్, తేరుబజారు, పీఆర్‌టీ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా కాలేజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా అభిమానులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. కేకలు, ఈలలతో మండుటెండను సైతం లెక్కచేయకుండా నామినేషన్ మహోత్సవంలో పాల్గొన్నారు. భారీ క్రేన్ల సాయంతో గజమాలలతో కేతిరెడ్డిని సత్కరించారు. ధర్మవరం వీధులన్నీ జనాలతో నిండిపోయాయి.

పులకించిన పుట్టపర్తి..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి. హిందూపురం ఎంపీ అభ్యర్థి జె.శాంత బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. హిందూపురం పార్లమెంటు పరిధిలోని పలు ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు, వైఎస్సార్ సీపీ అభిమానులు భారీగా తరలివచ్చారు. మరోవైపు పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అభిమానులు ఉదయమే తరలివచ్చారు. సత్యమ్మగుడిలో పూజలు చేసిన దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అనంతరం అక్కడి నుంచి కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి, చిత్రావతి నాలుగు లేన్ల రోడ్డు మీదుగా డ్వాక్రా బజారు, గణేశ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

కిక్కిరిసిన హిందూపురం..

హిందూపురంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎస్ దీపిక నామినేషన్ పండుగలా సాగింది. దారి పొడవునా అభిమానులు, కార్యకర్తలతో హిందూపురం కిక్కిరిసిపోయింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి జనాలు ఉదయమే తరలివచ్చారు. జై జగన్ నినాదాలతో హిందూపురం మార్మోగింది. బాలయ్య గుండెల్లో రైళ్లు పరిగెత్తే విధంగా వైఎస్సార్ సీపీ సంబరాలు అంబరాన్నంటాయి.

తోపుదుర్తికి నీరా'జనం'..

రాప్తాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి భారీ జనాలు తరలి వచ్చారు. ఉదయం ఆత్మకూరు మండలంలోని తన స్వగ్రామం తోపుదుర్తి నుంచి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలసి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భారీ ర్యాలీతో రాప్తాడుకు వచ్చారు. ర్యాలీలో అడుగడుగునా ప్రజలు హారతులు పట్టారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల నుంచి కార్యకర్తలు, అభిమానులు ఉదయమే రాప్తాడు చేరుకున్నారు. దారి పొడవునా 'మేమంతా సిద్ధం' జెండాలతో కార్యకర్తలు కనిపించారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ధర్మవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



నామినేషన్ అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న అశేష జనవాహిని



టీఎన్ దీపిక నామినేషన్ సందర్భంగా జనంతో కిటకిటలాడిన హిందూపురం అంబేడ్కర్‌సర్కిల్



ర్యాలీలో ప్రజలకు ఫ్యాన్ గుర్తు చూపుతున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక

కేరళ గవర్నర్‌ను కలిసిన ఎస్పీ మాధవరెడ్డి



కేరళ గవర్నర్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి బాబా ఆరాధనోత్సవాల్లో పాల్గొనేందుకు కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ బుధవారం పుట్టపర్తికి విచ్చేశారు. ప్రశాంతి నిలయంలో గవర్నర్‌ను ఎస్పీ మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో డీఎస్పీ వాసుదేవన్, ఆర్డీఓ భాగ్యరేఖ ఉన్నారు.



ఈరలక్కప్ప తరఫున నామినేషన్ వేస్తున్న నాయకులు

52 నామినేషన్లు దాఖలు

- నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం

పుట్టపర్తి అర్బన్: నామినేషన్ల పర్వం ముగింపు దశకు చేరుకుంది. బుధవారం పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. హిందూపురం పార్లమెంట్ స్థానానికి 7, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 45 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియనుంది.

- హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ తరఫున జోలదరాశి శాంత రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ తరఫున సమద్ షాహీన్, బీఎస్పీ తరఫున భాగ్య, ఆర్‌ఎస్‌పీ తరఫున శ్రీనివాసులు, నేషనల్ నవక్రాంతి తరఫున ధనుంజయ, స్వతంత్ర అభ్యర్థిగా కుల్లాయప్ప తమ నామినేషన్ పత్రాలను హిందూపురం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు.
- హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున టీఎన్ దీపిక, వేణురెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున బాలకృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా వెంకటేష్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ అభిషేక్‌కుమార్‌కు అందజేశారు.
- రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా వెంకటరాముడు, సంతోష్ కుమార్ రావ్, రాజశేఖర్, క్రాంతి కుమార్, ప్రకాష్‌రెడ్డి నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ వసంతకుమార్‌కు అందజేశారు.
- మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ తరఫున ఈరలక్కప్ప, టీడీపీ తరఫున ఎంఎస్ రాజు, బీఎస్పీ తరఫున ఇందీవర్, సమాజ్‌వాదీ పార్టీ తరఫున కృష్ణ, కాంగ్రెస్ పార్టీ తరఫున సుధాకర్, స్వతంత్ర అభ్యర్థులుగా లక్ష్మీనరసప్ప, జగన్నాథ ప్రసాద్, ప్రియాంక, రవీంద్ర, నరసింహామూర్తి తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ గౌరీశంకర్‌కు అందజేశారు.
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ తరఫున నరసింహప్ప, టీడీపీ తరఫున సవిత, బీఎస్పీ తరఫున ఆదినారాయణ, స్వతంత్ర అభ్యర్థులుగా హబీబ్, నరసింహప్ప తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ అపూర్వ భరత్‌కు అందజేశారు.
- పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ తరఫున దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, దుద్దుకుంట కిషన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ తరఫున పల్లె వెంకటకృష్ణ కిశోర్‌రెడ్డి, పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా పోలన్న, వెంకటేష్ తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ భాగ్యరేఖకు అందజేశారు.
- ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ తరఫున రంగ అశ్వర్థ నారాయణ, బీజేపీ తరఫున సత్యకుమార్ యాదవ్ రెండు సెట్లు, ఆలిండియా కిసాన్ జనతా పార్టీ తరఫున చైతన్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున వీర నారాయణస్వామి, జైభీంరావ్ భారత పార్టీ తరఫున ధారా శంకర్, స్వతంత్ర అభ్యర్థులుగా సోమశేఖర్, కవిత తమ నామినేషన్లను ఆర్‌ఓ వెంకటశివరామిరెడ్డికి అందజేశారు.
- కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ తరఫున షేక్ షానవాజ్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తరఫున సురేష్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున రాజేంద్ర తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ సన్నీ వంశీకృష్ణకు అందజేశారు.

క్లుప్తంగా

జిల్లా పోలీస్ అబ్జర్వర్‌గా ఇమ్నాలెన్సా



జనరల్ అబ్జర్వర్లను కలిసిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్/పుట్టపర్తి టౌన్: సత్యసాయి జిల్లా పోలీస్ అబ్జర్వర్‌గా నాగాలాండ్‌కు చెందిన ఇమ్నాలెన్సాను ఎన్నికల కమిషన్ నియమించింది. బుధవారం ఆయన కలెక్టరేట్‌కు విచ్చేసి కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాధవరెడ్డిని సైతం కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ప్రశాంత ఎన్నికలకు తీసుకుంటున్న చర్యలను, జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు.

జనరల్ అబ్జర్వర్ల రాక ..

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు ఇద్దరు జనరల్ అబ్జర్వర్లను నియమించింది. బుధవారం రాత్రి పుట్టపర్తిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వారిని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి కలిశారు. రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా దీపక్ రామచంద్ర తివారి, మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు అన్బుకుమార్‌ను నియమించింది. ప్రశాంత ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వారు చర్చించారు.

ఇద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేత

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు విజ్ఞప్తి మేరకు గుడిబండ మండలం సీసీ గిరి గ్రామానికి చెందిన పీజీ రాజన్న, అమరాపురం మండలం వి.అగ్రహారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తి వేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ



నాగభూషణ

లేపాక్షి: వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లేపాక్షి మండలం సడ్లపల్లికి చెందిన నాగభూషణ ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నాగభూషణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. తనను ఎంపిక చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాయలసీమ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యర్థులూ.. ఈ ఖర్చు దాటొద్దు

- ధరలు నిర్ణయించిన ఎన్నికల కమిషన్



పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై ఎన్నికల కమిషన్ నిఘా వేసింది. అభ్యర్థులు ప్రచారం, సభలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు తీస్తారు. ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ ఖర్చులను లెక్కిస్తారు. దీని కోసం ఎన్నికల కమిషన్ కొన్ని ధరలు నిర్ణయించింది. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను వివిధ విభాగాలుగా విభజించారు. ఈ ధరల ప్రకారమే ఎన్నికల వ్యయాన్ని చూపాల్సి ఉంటుంది. వివిధ విభాగాల్లో ధరలు ఈ విధంగా ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి మొత్తం రూ.40 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.25 లక్షల వరకూ ఖర్చు చేయవచ్చు.

- వాటర్ ప్రూఫ్ వేదిక అయితే చదరపు అడుగుకు రూ.35, సాధారణ వేదిక అయితే చదరపు అడుగుకు రూ.25 నిర్ణయించారు. చేతుల కుర్చీ ఒక దానికి రూ.8, సాధారణ కుర్చీ రూ.5, ఐరన్ టేబుల్ రూ.30, గ్రీన్ కార్పెట్/రెడ్ కార్పెట్ చదరపు అడుగు రూ.4గా నిర్ణయించారు. షామియానాకు రూ.300 నుంచి సైజును బట్టి రూ.4 వేల వరకు నిర్ణయించారు. సైడ్ వాల్స్ చదరపు అడుగుకు రూ.15.
- ఐరన్ స్టెప్స్ 3.5 అడుగులకు రూ.2వేలు, స్టీల్ చైర్‌కు రూ.30, స్టీల్ సోఫాకు రూ.500, మహారాజా సింగిల్ చైర్ రూ.1000, సాధారణమైతే రూ.15 వేలు చొప్పున లెక్కిస్తారు. ఫ్లెక్సీ బ్యానర్ చదరపు అడుగుకు రూ.20, పైపు వెడల్పు చదరపు అడుగుకు రూ.8, సౌండ్ సిస్టంకు ప్రత్యేకమైతే రూ.20 వేలు, సాధారణమైతే రూ.15 వేలు చొప్పున లెక్కిస్తారు. డ్రమ్ము, డస్ట్ బిన్‌లు ఒక్కొంటికి రూ.50, వీఐపీ చైర్ ఒక్కోటి రూ.100, బారికేడ్ ఐరన్ రూ.80, స్టీల్ సోఫా విత్ కవర్ రూ.500, వీఐపీ సోఫా విత్ కవర్ రూ.800, ఐరన్ టేబుల్ విత్ క్లాత్ ఒక్కోటి రూ.80 గా నిర్ణయించారు.
- పాంప్లెట్, పోస్టర్లకు 3 వేల కాపీలకు రూ.2,242 నుంచి రూ.35 వేలు, ఓటర్ స్లిప్ సింగిల్ కలర్ లక్ష కాపీలకు రూ.29,500, కలర్ పాంప్లెట్స్, పోస్టర్ల సైజుల వారీగా రూ.1 నుంచి రూ.10, క్లాత్ బ్యాడ్జీలకు ఒక్కోటి రూ.25, ఫ్లెక్సీ ప్లాస్టిక్ చదరపు అడుగుకు రూ.15, క్లాత్ ఫ్లెక్సీ రూ.35, ఆటో స్టిక్కర్ అడుగుకు రూ.30, క్యాప్ ఒక్కోటి రూ.45, టీ షర్ట్ ఒక్కంటికి రూ.180గా నిర్ణయించారు.
- వీడియో, ఫొటో షూట్ తదితర వాటికి రూ.354 నుంచి రూ.11,800, ఆడియో వాయిస్ రికార్డింగ్‌కు రూ.12,390 నుంచి రూ.24,780 సీడీ పెన్ డ్రైవ్ 60 నిమిషాలకు రూ.12,390, రెండు గంటలు అయితే రూ.17,700, ఎల్‌ఈడీ స్క్రీన్, అవుట్ డోర్ రూ.342, ఇండోర్ రూ.240గా నిర్ణయించారు. టిఫిన్‌కు రూ.25 నుంచి రూ.40, టీ/కాఫీ కు రూ.8 నుంచి రూ.15, స్నాక్స్ రూ.60 వరకు, కర్డ్ రైస్ రూ.60, సాధారణ భోజనం /ప్రత్యేక భోజనం/ బిరియాని/నాన్‌వెజ్ బిరియానికి రూ.80 నుంచి రూ.280 నిర్ణయించారు. వాటర్ ప్యాకెట్ రూ.3, వాటర్ బాటిల్ రూ.10 నుంచి రూ.12, మినరల్ వాటర్ బాటిల్ రూ.15 నుంచి రూ.28గా నిర్ణయించారు.
- హోటల్ సింగిల్ రూం ధర రూ.500 నుంచి రూ.5,500, డబుల్ రూం రూ.1,680 నుంచి రూ.56,150, హైరింగ్ వాహనాలు ఆటో, ట్యాక్సీ అయితే రూ.310 నుంచి రూ.1000 (రోజుకు), మిగిలిన వాహనాలు రూ.1500 నుంచి రూ.3,450, ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లకు కూడా ధరలు నిర్ణయించారు. డ్రైవర్ బత్తా రోజుకు రూ.300 నుంచి రూ.787గా నిర్ణయించారు. క్లాత్ బ్యానర్ రూ.200, క్లాత్ జెండా రూ.65, ప్లాస్టిక్ జెండా రూ.41గా నిర్ణయించారు.

బీజేపీ సేవలో ప్రభుత్వ వైద్యుని భార్య

ధర్మవరం: ప్రభుత్వ వైద్యుని భార్య బీజేపీ సేవలో తరిస్తున్నారు. ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప దంతవైద్యునిగా పనిచేస్తున్నారు. ఈయన భార్య నీరజ కూడా డాక్టరే. అయితే ఆమె ప్రైవేట్‌గా వైద్య సేవలందిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ తరఫున భార్య త్రివేణి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం డాక్టర్ వివేక్ ఇంటివద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా దంతవైద్యుని సమక్షంలోనే ఆయన భార్య డాక్టర్ నీరజకు బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ డాక్టర్ భార్య రాజకీయ పార్టీలో చేరడం విమర్శలకు తావిచ్చింది. ఇదిలా ఉండగా బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ నామినేషన్ సమయంలో సమర్పించిన వివరాలలో భార్య పేరు ప్రస్తావించలేదు. పిల్లలు మాత్రమే ఉన్నట్లు పొందుపరిచారు. ఎన్నికల ప్రచారంలో మాత్రం సత్యకుమార్ భార్యగా త్రివేణి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తుండటం ఆసక్తికరంగా మారింది.



ప్రభుత్వ డాక్టర్ వివేక్ భార్య నీరజకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ సతీమణి త్రివేణి



డాక్టర్ వివేక్ కుటుంబ సభ్యులను బీజేపీకి మద్దతు తెలపాలని కోరుతున్న త్రివేణి

ఆనందం నింపిన ఉద్యోగ భద్రత

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన నిర్ణయం సాహసోపేతం
- జిల్లా వ్యాప్తంగా 1,686 కుటుంబాల్లో సంతోషం



పుట్టపర్తి టౌన్: చాలీచాలని జీతాలు, అలవెన్సులతో ఇబ్బందులు పడుతూ వచ్చిన ఆర్టీసీ కార్మికుల ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయి. అనేక ఏళ్లుగా ఉద్యోగ భద్రత కోసం పోరాటం చేశారు. అయినా ఏ ప్రభుత్వమూ వారి మొర ఆలకించలేదు. సమ్మె చేస్తే జీతాల్లో కోత విధించేవారు. కానీ వారి సమస్యను అర్థం చేసుకునే ప్రభుత్వం 2019లో వచ్చింది. 2020 జనవరి ఒకటో తేదీన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. ప్రజా రవాణా శాఖ కిందకు తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, ఇతర బెనిఫిట్స్ వర్తింపజేసింది. ఈ సాహసోపేత నిర్ణయంతో కార్మికులు జీవితాలు బాగుపడ్డాయి. నష్టాల నుంచి ఆర్టీసీ లాభాల బాట పట్టింది. కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా నాలుగు నెలలు జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల్లో బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. అదే గత ప్రభుత్వమైతే ఇలాంటి పరిస్థితుల్లో జీతాల్లో కోతలు విధించేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదు. ఒకటో తేదీనే ఠంచన్‌గా జీతాలు చెల్లిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,686 ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాలు నిండాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు

డిపో పేరు	కండక్టర్లు	డ్రైవర్లు	ఇతర సిబ్బంది
ధర్మవరం	108	105	67
హిందూపురం	119	144	89
కదిరి	183	199	89
మడకశిర	53	71	51
పెనుకొండ	35	50	47
పుట్టపర్తి	71	107	67
డీపీటీఓ	2	4	24

ఎన్నికల వేళ.. ఎంతోమందికి జీవనోపాధి

హిందూపురం అర్బన్: ఎన్నికల సీజన్ ఎంతోమందికి జీవనోపాధి చూపుతోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులను రాజకీయ పార్టీలు ఖరారు చేయడంతో చాలామంది ఈ నెల 18 నుంచి నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్లు.. ప్రచారాలు, ర్యాలీల వేళ వాహనాలు, జనసమీకరణ.. భోజన సౌకర్యాలు తప్పనిసరి. ఇదే పలువురికి ఉపాధి కల్పిస్తోంది.

డప్పు ఉండాల్సిందే..

ర్యాలీలు, సభలు, సమావేశాలు కార్యక్రమం ఏదైనా డప్పు ఉండాల్సిందే. అభ్యర్థులు ప్రచారానికి వెళ్లినప్పుడు ముందుభాగాన డప్పుల మోతతో ప్రచారానికి జోష్ తెస్తారు. డప్పు కళాకారుల సంఖ్యను బట్టి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు రోజుకు ఇస్తున్నారు. ఇలా ఎన్నికల సమయంలో చేతినిండా పని దొరకుతోంది.

పూలకు డిమాండ్..

అభ్యర్థులు, ప్రచారానికి వచ్చే నాయకులకు పూల దండలు వేసేందుకు కార్యకర్తలు పోటీ పడుతారు. దీంతో పూలు, బొకేల వ్యాపారానికి గిరాకీ పెరిగింది. గులాబీల దండ రూ.1,200 – రూ.1,500 వరకు పలుకుతోంది. ఇలాంటివి ఒక్కో పార్టీ వారు ప్రచారాల్లో 20 నుంచి 50 దండల వరకు కొని తమ అభ్యర్థులకు వేస్తుండటంతో మార్కెట్‌లో పూలకు డిమాండ్ పెరిగింది.

మైక్‌లు.. టెంట్ హౌస్‌ల ఏర్పాటు

వేసవి కావడంతో అభ్యర్థులు మండల కేంద్రాలు, పంచాయతీ కేంద్రాల్లో సమావేశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన సమావేశాలకు టెంట్‌లు, కుర్చీలు, సమకూరుస్తున్నారు. ఇక లౌడ్ స్పీకర్లు, డీజేలతో పలువురు ఆదాయం పొందుతున్నారు.



ప్రింటింగ్ ప్రెస్‌లు కళకళ..

వివిధ పార్టీకు చెందిన అభ్యర్థులు ఓటర్లను కలిసేందుకు వెళ్లే సమయంలో తమకు కేటాయించిన గుర్తుతో కూడిన ప్రింటింగ్ పేపర్లతో పాటు బ్యానర్లు సిద్ధం చేస్తున్నారు. ముందస్తుగానే ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో మాట్లాడుకొని.. సకాలంలో కరపత్రాలు ముద్రించి ఇచ్చేందుకు అడ్వాన్సులు ఇస్తున్నారు.

ఇంధనం.. ఆహారం

ప్రచారాలు చేసే సమయంలో నాయకులు, కార్యకర్తల వాహనాలకు పెట్రోల్ పట్టించడం, భోజనాలు పెట్టించడం పరిపాటి. దీంతో పలు హోటళ్ల వారితో పాటు బజ్జీల బండ్ల వారు ఉపాధి పొందుతున్నారు.

రోజుకు రూ.500..

పట్టణాలు, గ్రామాల్లో ప్రచారాలు చేసే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా తమ ప్రాబల్యం చూపించుకునేందుకు జనసమీకరణ ముఖ్యం. ఆ సమయంలో ఒక్కో మనిషికి రూ.500 టిఫిన్, భోజనం సమకూర్చుతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా టీంలు ఏర్పాటయ్యాయి. వారికి ఏ రోజుకు ఎంత మంది అన్నది చెప్పి అడ్వాన్స్ ఇస్తే సమకూర్చేస్తున్నారు.

అద్దె వాహనాలు..

అభ్యర్థుల నామినేషన్ల మొదలు, ప్రచారాలకు అద్దె వాహనాలు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్లకు ప్రధాన పార్టీలు తమ ఉనికి చాటుకునేందుకు బస్సులు, జీపులు, ద్విచక్ర వాహనాలు, కార్లు అద్దెకు తీసుకొంటున్నాయి. దీంతో ఏంతో మంది జీవనం సాగిస్తున్నారు.

జిరాక్స్‌కు డిమాండ్..

ఎన్నికల పుణ్యమా అని జిరాక్స్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా ఓటర్ల జాబితాలు, ఎన్నికల సమయంలో అవసరమ్యే ప్రింటింగ్ పేపర్లు, పుస్తకాలు, ప్యాడ్‌లు, స్టేషనరీకి డిమాండ్ ఏర్పడింది.


వైభవంగా చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కణేకల్లు: మండల ప్రజల ఆరాధ్యదైవమైన చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా సాగింది. వేలాది భక్తులు పాల్గొనడంతో కణేకల్లు జనసంద్రమైంది. ఆలయంలో ఉదయం నుంచి సాయంకాలం వరకూ విశేష పూజలు, హోమాలు జరిగాయి. సాయంకాలం 5 గంటలకు ఉత్సవ మూర్తిని రథంపై అధిష్ఠింపజేసి ఎదురు బసవన్న గుడి వరకు, అక్కడి నుంచి ఈరనాగమ్మ కట్ట వరకు రథాన్ని లాగారు. రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ డి.పద్మావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వై.చంద్రమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, డాక్టర్ సోమన్న, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్కే బద్రి, గొల్ల వెంకటేశులు, రాజేష్, ముత్తు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాన్ని ఆలయ కమిటీ ధర్మకర్త జె.ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉయ్యాలసేవలో చౌడేశ్వరమ్మ



అమడగూరు: శీతిరెడ్డిపల్లిలో చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో బుధవారం ఉయ్యాల సేవ ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు ఆలయం నుంచి అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ ముత్యాలపల్లకీలో కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. తర్వాత కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని కొలువుదీర్చి మహిళలంతా ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో గురువారం సూర్యప్రభ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

స్టీరింగ్ లాకై ఆర్టీసీ బస్సు బోల్తా

- ఏడుగురికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

కనగానపల్లి: మామిళ్లపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఇజయతుల్లాతో పాటు ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు బుధవారం మధ్యాహ్నం హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అనంతపురం నుంచి హిందూపురానికి 33 మంది ప్రయాణికులతో వెళ్తోంది. బస్సు మామిళ్లపల్లి దాటిన తర్వాత మలుపు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో స్టీరింగ్ లాక్ అవడంతో అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ ఇజయతుల్లాతో పాటు ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108, ప్రైవేటు వాహనాలకు ద్వారా అనంతపురం, ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు.

సాయి నామం... పరవశించిన భక్త జనం

- కనుల పండువగా సత్యసాయి ఆరాధనోత్సవాలు



అలంకరణలో సత్యసాయి మహాసమాధి



గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్‌తో కలసి సత్యసాయి దివ్యాంగ సేవ పోస్టర్లను విడుదల చేస్తున్న ట్రస్ట్ సభ్యులు,



నారాయణ సేవకు హాజరైన భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామ స్మరణతో అశేష భక్త జనం పరవశించింది. తమ ఇష్టదైవమైన సత్యసాయిని కీర్తిస్తూ గీతాలాపనతో ఆత్మనివేదన చేశారు. ఫల, పుష్ప దళాలతో దేదీప్యమానంగా అలంకారప్రాయమైన సత్యసాయి మహాసమాధి చెంత సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి ఆరాధనోత్సవాలు బుధవారం కనులపండువగా జరిగాయి. ఉదయం సత్యసాయి విద్యార్థుల వేద మంత్రోచ్చారణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు రాజ్‌కుమార్ భారతి నేతృత్వంలో కళాకారుల బృందం కర్ణాటక సంగీత రీతితో పంచరత్న కీర్తనలు ఆలపించింది. మృదు మధుర స్వరాలతో సాగిన కచేరీతో భక్తజనం ఆధ్యాత్మిక పరవశానికి లోనయ్యింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రారంభోపన్యాసం చేశారు. సత్యసాయి చూపిన మార్గం భక్తకోటికి ఆచరణీయమన్నారు. అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్‌పాండే మాట్లాడుతూ అశేష భక్తకోటిని తన ప్రేమ మార్గంతో ముందుకు నడిపిన సత్యసాయి 100వ జయంతి వేడుకలను యావత్ ప్రపంచం మురిసేలా నిర్వహించేందుకు ప్రతి భక్తుడూ కృషి చేయాలన్నారు. ఇందుకు అనుగుణంగా దేశ విదేశాలలో ఉన్న సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ముఖ్య అతిథి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ చేతుల మీదుగా శ్రీసత్యసాయి దివ్యాంగ జన సేవ, శ్రీ సత్యసాయి లిక్విడ్ లవ్ యాప్‌లను ఆవిష్కరించారు.

ప్రేమజ్యోతి వెలిగించిన మహనీయుడు..

సత్యసాయి భక్త కోటిని ప్రేమతత్వంతో చేరదీసి వారిని అమ్మలా ఆదరించిన మహనీయుడు సత్యసాయి అని కేరళ గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. సత్యసాయి సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింసను బోధిస్తూ భక్తులకు సన్మార్గ దర్శనం చేశారన్నారు. లవ్ ఆల్ .. సర్వ్ ఆల్ నినాదంతో ప్రపంచ నలుమూలల ఉన్న తన భక్తులను సేవామార్గం వైపు నడిపించారన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, పేదరిక నిర్మూలన విభాగాల్లో సత్యసాయి చక్కటి వ్యవస్థలను ఏర్పాటు చేసి, మానవాళికి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాయి సేవాదళ్ విపత్తుల సమయంలో అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. సత్యసాయి చూపిన మార్గం సదా ఆచరణీయమన్నారు.

హిల్ వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ..

సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలోని సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ 'మహా నారాయణ సేవ' నిర్వహించింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన టెంట్లతో కార్యక్రమం చేపట్టారు. మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, నాగానంద సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 వేల మంది పేదలకు నారాయణ సేవలో భాగంగా అన్న ప్రసాదాలు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, మనోహర్ శెట్టి, మాధురీ నాగానంద, సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, జాతీయ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయి శతజయంతి..

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తామని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు పేర్కొన్నారు. నారాయణ సేవ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సత్యసాయి ఆశయాలను ముందుకు నడిపించేందుకు ట్రస్ట్ నిరంతర కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది నవంబర్ నుంచి సత్యసాయి శతజయంతి వేడుకల సన్నాహాలు ప్రారంభమవుతాయనిన్నారు. 100 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రెండేళ్లపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని సాయి సేవా కేంద్రాల్లో శతజయంతి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అలరించిన సంగీత కచేరి..

సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు నందినీ రావు నిర్వహించిన సంగీత కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.